సాక్షి నంద్యాల

మంగళవారం : 15 : ఆగస్టు : 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన మాగంటి జనార్దన యాదవ్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



'బయో' దుకాణాలపై విజి'లెన్స్'

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బయో పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పలు కారణాలతో కొన్ని మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. IIలో



డెంగీ నివారణకు చర్యలు

డెంగీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ సరస్వతి ఆదేశించారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో వారు పర్యటించారు. IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15 నుంచి వివిధ రకాల సేవలకు డిజిటల్ చెల్లింపులను మాత్రమే అంగీకరించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలకు సంబంధించి పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంకులో కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని ఇప్పటికే సూచించామన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి 2011 జనాభా లెక్కల ప్రకారం 3వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో పీఓఎస్ మిషన్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని, 3 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా, 158 గ్రామ పంచాయతీల్లో 3 వేలకు పైగా జనాభా ఉందని, అలాగే 326 గ్రామ పంచాయతీల్లో 3 వేల కంటే తక్కువ జనాభా ఉందన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఇప్పటికే ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

శ్రీశైలం రిజర్వాయర్‌లో 117 టీఎంసీలు



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. వరద ప్రవాహం గత కొద్ది రోజులుగా నిలిచిపోవడం, దిగువ ప్రాంతాలకు ప్రతి రోజు నీటి విడుదల జరుగుతుండడంతో నీటిమట్టం తగ్గుతోంది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్‌కేంద్రంలో 3.892 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దిగువ నాగార్జున సాగర్‌కు 5,935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 116.92 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యామ్ నీటిమట్టం 863.40 అడుగులకు చేరుకుంది.

వైభవంగా మల్లన్న వెండి రథోత్సవం



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి వెండి రథోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా సహస్రదీపార్చన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి సహస్ర దీపార్చన చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను వెండి రథంలో ఉంచి ఆలయప్రదక్షిణ చేయించారు. శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం, వరుస సెలవు దినాలు కావడంతో శ్రీశైలానికి భక్తులు పోటెత్తడంతో శ్రీగిరి భక్తజన సంద్రంగా మారింది.

మంత్రాలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వేలాదిగా భక్తులు మంత్రాలయం వచ్చారు. మూడో రోజు సోమవారం సైతం రద్దీ కొనసాగింది. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో సోమవారం సెలవుపెట్టుకుని చాలా మంది ఇక్కడికి వచ్చారు. 8 వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అంచనా. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి అరగంట సమయం పట్టింది. తుంగభద్ర నదీతీరం, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం, మంచాలమ్మ దర్శన క్యూలైన్లు కిటకిటలాడాయి. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు వచ్చారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.





నంద్యాల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో పంద్రాగస్టు ఉత్సవాలకు సిద్ధమైన వేదిక, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



నందికొట్కూరు మండలం కొణిదెలలో నా దేశం.. నాభూమి అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

దేశం తేజం ▸ మనదే

- నేడు పంద్రాగస్టు వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించనున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

ఒకప్పుడు..స్వేచ్ఛ లేదు.. స్వాతంత్య్రం లేదు.. బ్రిటీష్ వారు చెప్పిందే శాసనం.. చేసిందే చట్టం.. ఎదురు తిరిగితే తీవ్ర నిర్బంధం.. ఎన్నో ఉద్యమాలు.. ఎందరో త్యాగఫలం.. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. ఆంగ్లేయుల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు స్వేచ్ఛ లభించింది. నిండు లోకం హర్షించింది. భారతీయులకు మంచి కాలం వచ్చేసింది. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి నేటికి 76 సంవత్సరాలు పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఊరూవాడా వేడుకకు సిద్ధమయ్యింది. కార్యాలయాలన్నీ త్రివర్ణ శోభితంతో వెలుగులీనుతుండగా.. మువ్వన్నెల జెండా ఆవిష్కరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నాపెద్దా తేడా లేకుండా మంగళవారం మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేయనున్నారు. మహనీయులను స్మరించుకోనున్నారు.



నంద్యాల పట్టణంలో వంద అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నందికొట్కూరు మండలం బిజినవేములలో దేశభక్తి గేయానికి రిహార్సల్ చేస్తున్న విద్యార్థులు

నంద్యాల: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా ఆవిర్భావం తర్వాత రెండవసారి జరుగుతున్న వేడుకలను వైభవంగా చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించనున్న వేడుకలకు నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ, ఎమ్మెల్యేలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు భారీగా హాజరు కానున్నారు. ఉదయం 9.05 డిప్యూటీ సీఎం అంజాద్ బాషా జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కానుంది. పోలీసు దళ గౌరవ వందన స్వీకరణ, సాయుధ దళ పరిశీలన, స్వాతంత్య్ర దినోత్సవ సందేశం, సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులకు సన్మానం, ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండనున్నాయి. ఈ మేరకు వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పర్యవేక్షించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ మైదానానికి చేరుకుని జాతీయ పతాక ఆవిష్కరణ మొదలుకొని వేదిక బ్యాక్ డ్రాప్ పోలీసు సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్, బ్యారికేడింగ్, స్టేజీ నిర్మాణం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు ఉన్నారు. వేడుకలను తిలకించేందుకు ప్రజలు, అధికారులు, వీఐపీలు, విద్యార్థులు, మహిళలు 1500 మంది కూర్చునే విధంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. గ్యాలరీల వద్ద తాగు నీరు, అల్పాహారం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

పేరెంట్స్ కమిటీ చైర్మన్లతో జెండావిష్కరణ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో స్వాతంత్య్ర దిన వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆయా స్కూళ్ల పేరెంట్స్ కమిటీల చైర్మన్లతో ఆవిష్కరింపజేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పేరెంట్స్ కమిటీల చైర్మన్లు అందుబాటులో లేని చోట్ల ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు జెండాను ఆవిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

410 మందికి ప్రశంసా పత్రాలు

జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు స్వాతంత్ర, రిపబ్లిక్ దినోత్సవాల్లో ప్రశంసాపత్రాలు అందజేస్తారు. జిల్లా స్థాయి అధికారి నుంచి అటెండర్ వరకు అన్ని స్థాయి క్యాడర్లలో ఉత్తమ పనితీరును కనబరిచిన అధికారులకు ప్రోత్సాహిస్తారు. ఈ ఏడాది 410 మంది ఉద్యోగులు ఉత్తమ పనితీరు కనబరచినట్లు ఆయా శాఖల అధికారులు నివేదించారు. ఇప్పటికే ఎంపికైన ఉద్యోగులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. వారందరూ ఉదయం 8.30 గంటలలోపు పరేడ్ గ్రౌండ్ చేరుకోవాలి.

హర్ ఘర్ తిరంగా సెల్ఫీలను అప్‌లోడ్ చేయాలి..

ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రజలు ఎవరికీ వారు నిబంధనలు మేరకు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించి సెల్యూట్ చేయాలని కోరారు. అంతేగాక సెల్ఫీలు దిగాలని పిలుపునిచ్చారు. దిగిన సెల్ఫీలను హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

సీఐ మురళీధర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్



కర్నూలు: కర్నూలు మూడో పట్టణ సీఐ దాదిరెడ్డి మురళీధర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల వేళ రాష్ట్రంలోని పలువురు పోలీసు అధికారులకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పలు పతకాలు ప్రకటించింది. ఇందులో భాగంగా తన సర్వీసు కాలంలో ఉత్తమ సేవలు అందించినందుకు 2023 సంవత్సరానికి మురళీధర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్(పురస్కారం) దక్కింది. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన మురళీధర్‌రెడ్డి 1996లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఈయన తండ్రి మస్తాన్‌రెడ్డి కూడా పోలీసు అధికారిగా పదవీ విరమణ పొందారు. మురళీధర్‌రెడ్డి తన సర్వీసు కాలంలో సేవా పతకం(2009), ఉత్కృష్ట సేవా పతకం(2021), ఉత్తమ సేవా పతకం (2022), 6 ఎంఎస్‌ఈలు, 163 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, 6 కమెండేషన్ మెడల్స్, 25 క్యాష్ రివార్డులు పొందారు. ఈయన 2011లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. 2024 జనవరి 26వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా మురళీధర్‌రెడ్డి ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకోనున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



గోరుకల్లు రిజర్వాయర్ వద్ద కృష్ణమ్మకు చీరె, సారెను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీ పోచా

- బ్లాక్‌ల వద్ద నీటి వృథా అరికట్టేందుకు రైతులు చొరవ చూపాలి
- ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఆశించిన స్థాయిలో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేదని, అందుబాటులో ఉన్న నీటిని ఆయకట్టు రైతులు పొదుపు వినియోగించుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. ఇటీవల బానకచర్ల హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలైన కృష్ణా జలాలు సోమవారం గోరుకల్లు రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. సీఈ కబీర్ బాషా ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యే గోరుకల్లు చేరుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, చీరెసారె సమర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో సాగునీటి ప్రాజెక్టులకు ఆశించిన మేర నీటి విడుదల లేదన్నారు. ఈ ఏడాది శ్రీశైలం జలాశయం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేవలం 23 టీఎంసీలు మాత్రమే కేటాయించారన్నారు. త్వరలోనే ఆయకట్టు రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ఎస్సార్బీసీ కాల్వకు నీరు విడుదల చేస్తామని, నీటిని దుర్వినియోగం చేయకుండా అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లులోకి 6వేల క్యూసెక్కులు చేరుకుంటున్నాయన్నారు. ఇటీవల కుంగిన గోరుకల్లు కట్టను నెల రోజుల్లో మరమ్మతులు పూర్తి చేశామన్నారు. గోరుకల్లు కట్ట కుంగిన విషయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా యుద్ధ ప్రాదిపతికన గ్రీన్‌కో వారి సహాయంతో పనులు చేయించినట్లు చెప్పారు. మరమ్మతుల కోసం రూ. 90 లక్షలు నిధులు కేటాయించారన్నారు. అలాగే పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.100 కోట్లు మంజూరు చేశారన్నారు. గోరుకల్లు కట్ట విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఈఈ సుభకుమార్, డీఈఈలు గోవర్దన్, రాజశేఖర్, ఏఈలు, జేఈఈలు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉసేన్‌సా, శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మయ్య, పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బొజ్జన్న, శంకర్‌రెడ్డి, రవి, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, తొగర్చేడు శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, బాబుజాకీర్ ఉసేన్, నారాయణస్వామి, ఈశ్వరయ్య, రామచంద్రుడు, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి అరుదైన గౌరవం

- శ్రీనగర్ ఎస్పీకి ఐదో విడత పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు



జి.వి.సందీప్ చక్రవర్తి, శ్రీనగర్ ఎస్పీ

కర్నూలు: జమ్మూ కశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్ సిటీ ఎస్పీ డాక్టర్ జి.వి.సందీప్ చక్రవర్తికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు(పీఎంజీ) దక్కింది. ఈయన కర్నూలు నగరవాసి. మంగళవారం న్యూఢిల్లీలో జరిగే పరేడ్‌లో ఈయన పీఎంజీ అవార్డును అందుకోనున్నారు. అస్థిరమైన కశ్మీర్ ప్రాంతంలో దేశద్రోహ వ్యతిరేక, కౌంటర్ తిరుగుబాటు కార్యకలాపాల అణచివేతలో అత్యుత్తమ ప్రతిభ సేవలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈయనకు పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు ప్రకటించింది. తన ఎనిమిది సంవత్సరాల సర్వీసులో సందీప్ చక్రవర్తి 5వ సారి పీఎంజీ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. కర్నూలు ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ జి.వి.రామగోపాల్ రావు, వైద్యఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రంగమ్మ దంపతుల కుమారుడు సందీప్ చక్రవర్తి ప్రస్తుతం శ్రీనగర్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి హైస్కూల్‌లో పాఠశాల విద్య, కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ డిగ్రీని పొందారు. 2014 యూపీఎస్సీలో సివిల్స్ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

కర్నూలు(సెంట్రల్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఏటా నిర్వహించే స్టెనోగ్రాఫర్ గ్రూపు సీఅండ్ డీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్‌లో కంప్యూటర్ బేస్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని, వివరాల కోసం ssc.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రెండు సర్పంచ్, 38 వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవం

- సర్పంచ్, 19 వార్డు మెంబర్ల స్థానాలకు 19న ఎన్నికలు

నంద్యాల(అర్బన్): పల్లె ఉప పోరులో జిల్లాలో మూడు సర్పంచ్‌లు, 55 వార్డు మెంబర్ల ఖాళీలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల కాగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయానికి రెండు సర్పంచ్ స్థానాలు, 38 వార్డు మెంబర్ల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి తెలిపిన వివరాల మేరకు జిల్లాలో ప్రస్తుతం ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు పంచాయతీ సర్పంచ్‌తో పాటు 19 వార్డు మెంబర్లకు ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 10న నామినేషన్ల స్వీకరణ రోజు అవుకు మండలం అన్నవరం గ్రామ సర్పంచ్ స్థానానికి సాయినాథరెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె పంచాయతీకి పోటీలో నిలిచిన ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో బోయ శివశంకర్ ఒక్కరే పోటీలో నిలవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌ఓ అన్వర్‌బాషా ఎన్నిక పత్రాన్ని అందజేశారు.

క్లుప్తంగా

పోలీస్ స్పందనకు 89 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు. డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా ఆరోగ్యశ్రీ అమలు



మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారు. ఇకపై ఆసుపత్రిలోని అన్ని విభాగాధిపతులతో ప్రతి సోమవారం ఆరోగ్యశ్రీపై సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

అమరం.. అఖిలం.. మీ త్యాగం

- స్వాతంత్య్ర ఉద్యమంలో జిల్లా నాయకుల కీలకపాత్ర
- జిల్లాలో రెండు విడతలుగా మహాత్ముని పర్యటన
- సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ వారిని తాకిన ఉద్యమ జ్వాల
- స్వాతంత్య్ర ఉద్యమంలో సర్వం కోల్పోయిన త్యాగధనులు
- నేడు స్వాతంత్య్ర దినోత్సవం

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర సంగ్రామంలో జిల్లా వాసులు అలుపెరుగని పోరాట స్ఫూర్తిని కనబరిచారు. తెల్లదొరల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. ధన, మన, ప్రాణాలు ఫణంగా పెట్టారు. జైలు శిక్షలకు వెరవక ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగారు. వందేమాతరం అంటూ ఉప్పెనై కదిలి బ్రిటీష్ పాలకులను గజగజ వణికించారు. తుపాకీ తూటాలను సైతం లెక్క చేయక స్వాతంత్య్రమే లక్ష్యంగా కదం తొక్కారు. సిపాయిల తిరుగుబాటు 1857లో జరగగా..అంతకు ముందే కర్నూలు జిల్లాలో తెల్లదొరలపై ఉద్యమానికి బీజం పడింది. 1801లోనే తెర్నేకల్లులో తిరుగుబాటు ప్రారంభమైంది. 1842లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవ శంఖం పూరించాడు. వారి త్యాగం అమరం..అఖిలం.. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

గర్జించిన గులాం రసూల్ ఖాన్

బ్రిటీష్ దొరల పెత్తనాన్ని కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ వ్యతిరేకించారు. తన అనుచరులందరినీ వెంటబెట్టుకొని వెళ్లి కర్నూలు సమీపంలోని జొహరాపురం కేంద్రంగా ఉద్యమం ప్రారంభించారు. 1839లో వహబీ ఉద్యమ నేతలతో సంబంధాలు పెట్టుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. బ్రిటీష్ సైన్యం గులాం రసూల్ ఖాన్‌ను బంధించి తిరుచునాపల్లి జైలుకు తరలించింది. ఆయనపై విష ప్రయోగం చేసి నిర్దాక్షిణ్యంగా హతమార్చింది.

ఎందరో పోరాట యోధులు..

ఖాదర్‌బాద్ నర్సింగరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి.చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదరంబరం, మేడం వెంకయ్య శెట్టి, పెండేకల్ అట్లారెడ్డి లక్ష్మమ్మ, మేడం వెంకయ్యశెట్టి, ధరణి రాచంద్రారావు, సర్దార్ నాగప్ప, సర్దార్ అమరావతమ్మ వంటి ఎందరో పోరాట యోధులు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్నారు.


స్ఫూర్తి ప్రదాతలు


- నంద్యాల జిల్లా కడుమల కాలువకు చెందిన టీకే ఆర్ శర్మ భూస్వామి. ఈయన స్వాతంత్య్ర పోరాటానికి తన ఆస్తినంతా ఇచ్చారు. ఈయన సోషలిస్ట్ వాది. రామ్ మనోహర్ లోహియా అనుచరుడు. 1962–67 లో కర్నూలు ఎమ్మెల్యేగా పనిచేశారు.
- కర్నూలు పెద్దమార్కెట్ ఎదురుగా సుభాష్ హేర్‌కటింగ్ షాప్ ఉండేది. దీన్ని రంగన్న అనే వ్యక్తి నిర్వహిస్తుండేవారు. ఆయన కుమారుడు పుల్లన్న, ఆయన కుమారుడు సుభాష్‌లు దుకాణాన్ని నిర్వహిస్తూ స్వాతంత్య్ర ఉద్యమ నాయకులకు ఉచితంగా కటింగ్ చేసేవారు. అదే ప్రాంతంలోనే నాగోజీ అనే టైలర్ ఉండే వారు. ఆయన ఉచితంగా బట్టలు కుట్టించి ఇచ్చేవాడు. అక్కడే ఉడిపి హోటల్ ఉండేది. వీరు సైతం ఉచితంగా భోజనం పెట్టేవారు.

జిల్లాలో పర్యటించిన గాంధీజీ

స్వాతంత్య్రోద్యమ కాలంలో జాతిపిత గాంధిజీ ప్రసంగం ఆదోని ప్రజల్లో స్ఫూర్తిని నింపింది. 1926లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించింది. ఇందుకు నిరసనగా గాంధీజీ దేశంలో పాదయాత్ర చేపట్టి దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. ఇందులో భాగంగానే ఆయన 1930 సెప్టెంబర్ 30న కర్ణాటకలోని సండూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొని అనంతరం రైలులో ఆదోనికి చేరుకున్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతిపిత ఉద్వేగంగా హిందీలో ప్రసంగించారు. పట్టణానికి చెందిన చున్నీలాల్ జయచంద్ సోనో ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. ఆయన ఉద్వేగ పూరితంగా చేసిన ప్రసంగం స్థానికంగా ప్రజల్లో స్వాతంత్య్ర సమర స్ఫూర్తిని నింపింది.

తెల్లదొరలపాలిట సింహ స్వప్నం





రేనాటి సూర్యుడు, విప్లవ వీరుడు ఉయ్యాలవాడ వీర నరసింహారెడ్డి బ్రిటీష్ నిరంకుశత్వ పాలనకు ప్రతిఘటించారు. 1842లో తెల్లదొరలపై తిరుగు బాటు బావుటా ఎగురవేశాడు. తన పోరాటంలో కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమే కాక బ్రిటీష్ వారి ఖజానాను అంతా కొల్లగొట్టారు. ఈయన విప్లవ మార్గానికి వణికిపోయిన బ్రిటీష్‌వారు 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోవెలకుంట్ల సమీపంలో గల జుర్రేరు ఒడ్డున ఉరిశిక్ష అమలు పరిచారు.

పోరుగల్లు.. తెర్నేకల్

జిల్లాలో 1801లోనే బ్రిటీష్ వారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశారు తెర్నేకల్ వాసులు. బ్రిటీష్ వారు వేసిన పన్నుకు వ్యతిరేకంగా ముత్తుకూరు గౌడప్ప ఆధ్వర్యంలో బ్రిటీష్ సైన్యంతో పోరాటం చేశారు. పోరులో గౌడప్పతో పాటు ఆ గ్రామ రైతులు బలయ్యారు.

సంచలనంగా కర్నూలు సర్క్యులర్

కర్నూలులో కొందరు విప్లవ భావాలతో ఒక సర్క్యులర్ రూపొందించారు. దీన్నే కర్నూలు సర్క్యులర్ అంటారు. ఆంధ్రదేశమంతటా ప్రజలు టెలిఫోన్ తీగలను తెంపివేయాలని, రైలు పట్టాలను తొలగించాలని కార్మికులు సమ్మెకు పిలుపునివ్వాలని, రైల్లో టికెట్ లేకుండా ప్రయాణాలు చేయాలని ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకూడదని, ప్రభుత్వ ఆజ్ఞలు దిక్కరించాలని పిలుపునిస్తూ ఒక సర్క్యులర్ రూపొందించారు. ఇది రాష్ట్రమంతటా సంచలనం రేపింది.

పత్రికల ప్రభావం

స్వాతంత్య్ర ఉద్యమంలో గాడిచెర్ల విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభ, ఉపాధ్యాయ, భద్రవాణి లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకర నారాయణ భజన మందిరం, హిందూ మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్ దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్య్ర కాంక్ష పెరగడానికి ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి.

ముందే ఎగిరిన జాతీయ జెండా

దేశంలో క్విట్ ఇండియా ఉద్యమం నాటికి జిల్లాలో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ సమయంలో కర్నూలులోని రాణి తోట మైదానంలో జాతీయ జెండా ఎగుర వేసి వందేమాతర గీతాన్ని ఆలపించాలని తలచారు. కానీ ప్రభుత్వ నిర్బంధం వల్ల ఎవరూ సాహసించ లేకపోయారు. అటువంటి సమయంలో తిప్పారెడ్డి అనే దేశ భక్తుడు కొందరు పిల్లలను తోడుగా తీసుకెళ్లి ధైర్యంగా జెండా ఎగుర వేశారు.

ఆలూరుకు ప్రత్యేక గుర్తింపు

ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 12 మంది స్వాతంత్య్ర సమరయోధులు ఉన్నారు. సంజీవరెడ్డి, గోవిందదాసు, అక్బర్ అలీ, పుల్లా అయ్యపరెడ్డి, హెచ్. బసవన్నగౌడ్, బొగ్గుల బాలయ్య, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమప్ప నాయక్, పాపయ్య చౌదరి లాంటివారు స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆంగ్లేయులను ఎదురించడంతో వీరిని అరెస్ట్ చేసి బళ్లారిలోని హళ్లీపూర్ జైలులో కొన్ని రోజుల పాటు ఉంచారు. వీరికి గుర్తుగా ఆలూరులోని మండల పరిషత్తు కార్యాలయం వద్ద స్తూపాన్ని సైతం ఏర్పాటు చేశారు. డి.గోవిందదాసు నియోజకవర్గ శాసన సభ్యులుగా సేవలు అందించారు.

ఖద్దరు నిధికి విరాళాలు

1929 సంవత్సరం మే నెలలో గాంధీజీ ఆలిండియా ఖద్దరు యాత్రలో భాగంగా జిల్లాలోని చాగలమర్రి, నల్లగట్ల, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోనిలో ఖద్దరు నిధికి చందాలు వసూలు చేశారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి



స్వాతంత్య్రం కోసం ఎందరో త్యాగధనులు తమ మాన, ప్రాణాలను పోగొట్టుకున్నారు. జిల్లాకు చెందిన మహా నాయకులు సైతం ఇందులో పాల్గొని ఖ్యాతిని తెచ్చారు. అలాంటి వారందరినీ స్ఫూర్తిగా తీసుకోవాలి. స్వాతంత్య్రం వచ్చిందని మరచిపోకుండా, ఆ స్వాతంత్య్ర ఉద్యమ ఫలాలను అందరికీ అందించాలి.

– కురాడి చంద్రశేఖర కల్కూర, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు

మహనీయులను స్మరించుకోవాలి



స్వాతంత్య్ర దినోత్సవం అంటే కేవలం జాతీయ జెండా ఎగుర వేసి మిఠాయిలు పంచుకొని తినడం కాదు. ప్రతి భారతీయుడు మూడు రంగుల జెండాను గుండెల్లో ప్రతిష్ఠించుకుని, హృదయం నిండా దేశభక్తిని నింపుకోవాలి. స్వాతంత్య్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలి. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం భరత మాత బిడ్డలం అంటూ సమైక్యతను చాటాలి.

– హరికిషన్, కవి, ఉపాధ్యాయుడు

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): డెంగీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ సరస్వతి, ఎంపీహెచ్ఈఓ నిత్యపూజయా ఆదేశించారు. సోమవారం వారు డెంగీ కేసులు నమోదైన కర్నూలులోని ముజఫర్‌నగర్, శ్రీరామనగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు అర్బన్‌లో 78, గ్రామాల్లో 174 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఆయా ప్రాంతాల్లో మలేరియా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆరా తీశారు. కేసులు వచ్చిన చోట యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. లార్వా లు ఉన్న చోట అబిట్ మందును పిచికారి చేయా లని చెప్పారు.

భర్త మద్యానికి బానిసయ్యాడని..



మృతి చెందిన నందిని

పాములపాడు: భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెలిమిల్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన గౌరీ శంకర్, నందిని(35) దంపతులు ఉపాధి నిమిత్తం 15 సంవత్సరాల క్రితం చెలిమిల్ల గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా గౌరీ శంకర్ మద్యానికి బానిసై కుటుంబం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడు. ఈ క్రమంలో పలుమార్లు నందిని వారించినా అతనిలో మార్పు రాలేదు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఈ నెల 13వ రాత్రి విషపు గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు.

ఫుట్‌బాల్ అండర్-14 జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు(రూరల్): ఫుట్‌బాల్ అండర్–14 కర్నూలు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 16వ తేదీన కడపలో జరిగే జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జట్టుకు భవి, ఆదిల్, ఉమేష్, సూర్య, రోహిత్, రిషికేష్, ప్రవీణ్, సుహాన్, జస్వంత్, శ్యామ్, అబ్దుల్, వాజిత్, ప్రజ్వల్, నరేంద్ర, చౌలరాజు, అజయ్, జస్సు, అభి ఎంపికయ్యారు.

'లా' రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన 'లా' (ఎల్ఎల్‌బీ) 3, 5 సంవత్సరానికి సంబంధించిన 3, 5, 9 సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడవ ఏడాది 3 సెమిస్టర్‌లో 195 మందికి గాను 101 మంది, 3 సంవత్సరం 5 సెమిస్టర్‌లో 173 మందికిగాను 136 మంది, 5 ఏడాది 3 సెమిస్టర్‌లో 43 మందికి గాను ఇద్దరు, 5 సంవత్సరం 9 సెమిస్టర్‌లో 94 మందికి గాను 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వీసీ ఎ.ఆనందరావు తెలిపారు.

కిరాణ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

డోన్ టౌన్: పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో సోమవారం జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి కాశీంవలి, డోన్ తూనికలు కొలతల అధికారి ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని మురారి రవి, పవనసుధ, కంభాలపాడు రోడ్డులోని చిల్యాట శ్రీను, కామాక్షి ట్రేడర్స్ తదితర కిరాణా షాపులతో పాటు మరి కొన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టి శ్యాంపుల్స్ సేకరించారు. తనిఖీల విషయం తెలుసుకున్న కొందరు కిరాణం దుకాణ యజమానులు షాపులను మూసివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గత వారం ఆయిల్ దుకాణాలపై దాడులు చేశామని, ప్రస్తుతం కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేసి నాణ్యత ప్రమాణాలను పరిశీలించినట్లు తెలిపారు.

మరణంలోనూ తోడుగా..

- భార్య మరణం తట్టుకోలేక ఆగిన భర్త గుండె
- గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి



లింగాల కళావతి (ఫైల్)



లింగాల ఏసన్న (ఫైల్)

గడివేముల: వారిది ఏడుగడుల బంధం. కష్టసుఖాల్లో తోడుగా నిలిచారు. సంతానం లేకపోవడంతో ఒకరినొకరు లోకంగా బతికారు. వ్యవసాయం చేసుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతున్న సమయంలో భార్యను క్యాన్సర్ మహమ్మారి కబళించింది. ఆమె మరణాన్ని ఆ భర్త తట్టుకోలేకపోయాడు. ఆయన గుండె ఆగిపోయింది. గంటల వ్యవధిలో భార్యాభర్తలు ప్రాణం విడిచారు. ఈ విషాద ఘటన బూజనూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లింగాల కళావతి(48), లింగాల ఏసన్న (58) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి సంతానం లేదు. కొన్నాళ్ల క్రితం కళావతికి అనారోగ్యంగా ఉండటంతో వైద్య పరీక్షలు చేయించడంతో క్యాన్సర్ అని బయటపడింది. మందులు వాడుతున్నా కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో ఆమె మృతి చెందింది. కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా భర్త ఏసన్న కుప్ప కూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. ఒకే రోజు దంపతులిద్దరూ కొద్ది సమయంలోనే మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

బయోపెస్టిసైడ్స్ దుకాణాలపై విజి'లెన్స్'

కర్నూలు: జిల్లాలోని దేవనకొండ, ఆస్పరి, కల్లూరు ప్రాంతాల్లోని బయోపెస్టిసైడ్స్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దేవనకొండలోని రవికిరణ్ ట్రేడర్స్‌లో అనధికార స్థలంలో పెస్టిసైడ్స్ నిల్వ ఉంచినందున రూ.4.34 లక్షల విలువచేసే పురుగు మందులను సీజ్ చేశారు. అలాగే బయో స్టిములెంట్స్‌నకు జి 2 ఫారాలను సమర్పించనందుకు రూ.8.86 లక్షల విలువ గల స్టాక్‌ను తాత్కాలిక నిలుపుదలకు ఆదేశాలు ఇచ్చారు. ఆస్పరి సాయి పెస్టిసైడ్స్‌లో సరైన ఇన్‌వాయిస్ బిల్లులు చూపనందుకు రూ.8,520 విలువ చేసే మందులను సీజ్ చేశారు. కల్లూరు భాగ్యలక్ష్మీ ఏజెన్సీ, విజయలక్ష్మి ట్రేడర్స్‌లో జి2 ఫారం సమర్పించనందున రూ.39 వేల విలువ చేసే మందుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

క్లుప్తంగా

ఆప్సా రాయలసీమ రీజియన్ అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (ఆప్సా) రాయలసీమ రీజియన్ అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన కరుణామయ విద్యాసంస్థల చైర్మన్ దండె దస్త గిరిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుందర్‌రాం సోమవారం తెలిపారు. నంద్యాలలో జరిగిన రాయలసీమ రీజియన్ కరస్పాండెంట్ల సమావేశంలో ఈ ఎన్నిక జరిగిందని చెప్పారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేఖ సిబ్బందితో కలిసి సచివాలయ పరిధిలోని కొండమాయపల్లెలో మునగాల నాగహరిణి అనే విద్యార్థిని బడి బయట ఉండటాన్ని గుర్తించారు. సోమవారం విద్యార్థిని ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుబ్బరాయుడుకు అప్పగించారు. విద్యార్థిని 8వ తరగతి వరకు చదివి బడి మాని వేసిందని తెలుసుకొని ప్రస్తుతం ఆమె వయస్సును బట్టి హెచ్‌ఎం 10వ తరగతిలోకి చేర్చుకున్నారు.

యోగా పోటీలకు ఎంపిక

చాగలమర్రి: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర)పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఐడీకే శాస్త్రి తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ నెల 13న ఆళ్లగడ్డలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో వినయ్ బంగారు పతకం, మహిద్ రజత పతకం, సాజిద్ కాంస్య పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు వచ్చే నెల 9,10వ తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

భారత జవాన్ గోడు..


భరత మాతతో బాధను వివరిస్తున్న జవాన్ చిత్రం

నంద్యాల(అర్బన్): మణిపూర్ సంఘటనలో భార్యను అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటనకు కుమిలిపోతూ భరత మాతతో తన గోడును విన్నవించుకుంటున్న వీరజవాన్ గాథను కోటేష్ ఆర్ట్ అకాడమీ చిన్నారి అశ్లేష గీచిన సందేశాత్మ చిత్రం అబ్బురపరిచింది. దేశ సరిహద్దులో ఉంటూ దేశ సేవ కోసం శత్రువులతో పోరాడిన తాను తన భార్యను కాపాడుకోలేక పోయానంటూ భరత మాతతో మొరపెట్టుకుంటున్న సంఘటనను చిత్ర రూపంలో వివరించింది. మాలాంటి జవాన్లకు ఇది చాలా అవమానమంటూ రోదిస్తున్న తీరుకు భరతమాత సైతం కంటతడి పెట్టినట్లుగా చిత్రించడంతో పలువురి ప్రశంసలు పొందింది.

అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం

నంద్యాల(న్యూటౌన్): ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీరామ కృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఘనంగా సన్మానించారు. డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ విజయ్‌బాబు మాట్లాడుతూ 1993లో జమ్ముకాశ్మీర్ తీవ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాను గోపాల్ తల్లి నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన లింగమ్మకు సన్మానించి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇండియన్ ఆర్మీలో పనిచేసిన కృష్ణుడు కూడా సనాంచారు.

వీరులను స్మరించుకుందాం

ఉయ్యాలవాడ : దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి వీరుడిని బాధ్యతగా స్మరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి అన్నారు. మండలంలోని పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె గ్రామాల్లో సోమవారం నా భూమి నా దేశం కార్యక్రమం చేపట్టారు.

దొర్నిపాడు: వీరులను స్మరించుకొని పంచభూతాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం గుండుపాపల, డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ.గోవిందిన్నె, క్రిష్టిపాడు గ్రామాల్లో నాభూమి– నాదేశం నిర్వహించారు.

పాల దిగుబడి పెంచాలి

నంద్యాల(సెంట్రల్): గ్రామాల్లో మేలుజాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించటంతో పెయ్య దూడలను ఎక్కువ ఉత్పత్తి చేసి, పాల దిగుబడి పెంపొందించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటసుబ్బారెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ..ఒక్కొక్కటి రూ.675 విలువైన లింగ నిర్ధారిత వీర్యనాళికలతో రెండు సార్లు కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. రెండు వీర్యనాళికల ధర రూ.1,350 కాగా, అందులో రైతు రూ.500 చెల్లించాలని, మిగిలిన రూ.850 ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు.

దేవస్థాన హద్దుల్లోనే వ్యాపారాలు చేసుకోవాలి

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థానం హద్దుల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించుకునేలా వేలం పాటలు నిర్వహించాలని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా ప్రతినిధులను సంప్రదించకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నారని అహోబిలంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం సరిహద్దులు కాదని పంచాయతీ, రిజర్వు ఫారెస్ట్ పరిధిలో వ్యాపారాలు నిర్వహించుకునేలా వేలం పాటలు నిర్వహించడం తగదన్నారు. భక్తులు ఇచ్చిన రూ.30 కోట్లకు అహోబిలం మఠం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల బలోపేతానికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- చింతకుంటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గ్రామంలో లబ్ధి పొందిన వారి వివరాలు..	
మొత్తం నివాస గృహాలు –	1,418
లబ్ధి పొందిన కుటుంబాలు	-1,375
ఒక్క పథకం లబ్ధి పొందిన వారు	-135
రెండు పథకాలు లబ్ధి పొందిన వారు	- 485
మూడు పథకాలు లబ్ధి పొందిన వారు	- 512
నాలుగు పథకాలు లబ్ధి పొందిన వారు	- 223
ఐదు పథకాలు లబ్ధి పొందిన వారు	- 20
ఖాతాల్లో జమ అయిన లబ్ధి మొత్తం	- రూ 10,72,01,678

ఆళ్లగడ్డ: పేదలు ఆర్థికంగా బలోపేతం చెందేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఇంతకుముందెన్నడూ అర్హులందరికీ పథకాలు అందిన దాఖలాలు లేవని, ప్రస్తుతం మాత్రం కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట గ్రామంలో ఎంపీపీ గజ్జ రాఘవేంద్రారెడ్డి, కమిషనర్ రమేష్‌బాబుతో కలిసి సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాగా.. తమకు ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో లక్షలాది రూపాయలు పథకాల కింద అందాయని స్వచ్ఛందంగా వెల్లడించడం గమనార్హం. గ్రామంలో మొత్తం నివాస గృహాలు 1,418 ఉండగా 1,375 ఇళ్లకు సంక్షేమ పథకాలు అందాయి. అంటే సుమారు 97 శాతం కుటుంబాలకు పథకాలు అందాయి. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. పథకాలతో ప్రయోజనం పొందిన వారి ఇంటి వద్దకు వెళ్లినప్పుడు హారతి పట్టి తిలకం దిద్ది సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. తాము టీడీపీ వారమని తెలిసినప్పటికీ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతుంటే ప్రతి పక్షాలు కళ్లుండి చూడలేని కబోదుల్లా మాట్లాడుతుంటే ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు.


లబ్ధి పొందిన పథకాల గురించి దివ్యాంగుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయం

నంద్యాల(సిటీ): ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డు వైఎస్సార్ నగర్ లో వార్డు ఇన్‌చార్జ్ టీవీ రమణ, కౌన్సిలర్ సావిత్రమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పార్కులో మొక్కలను నాటారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా పలు సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ప్రయోజనాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుపేరుగా పాలన సాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ రవి చంద్రారెడ్డి, నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహరావు, తిరుపతయ్య, జాకీర్ హుసేన్, అన్వర్ బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ పాల్గొన్నారు.


మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

డిజిటల్ తరగతులు

రుద్రవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో బోధిస్తున్నారు. పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం సుబ్బరాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు ప్రభుత్వం 9 ఐఎఫ్‌పీ, 4స్మార్టు టీవీలను మంజూరు చేసింది. వాటి ద్వారా 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ బోధన చేస్తున్నామని చెప్పారు.

నలుగురు నామినేషన్లు ఉప సంహరణ

ఆళ్లగడ్డ: కోట కందుకూరు గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్‌ల ఉప సంహరణ గడువు సోమవారంతో ముగియడంతో అధికారులు పోలింగ్ ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించారు. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఉప సంహరణ రోజు 11 మంది ఉప సంహరించుకోగా ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామకృష్ణ నాయక్ ప్రకటించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించారు.

శిరివెళ్ల: మండలంలో వార్డు ఎన్నికకు వేసిన నామినేషన్లను నలుగురు అభ్యర్థులు ఉప సంహరించుకున్నారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ముగ్గురు, గుంప్రమాన్‌దిన్నెలో ఒకరు తమ నామినేషన్‌ను ఉప సంహరించుకున్నారు. గుంప్రమాన్‌దిన్నె 12వ వార్డుకు వట్టికూరి పద్మావతి ఒకరే నామినేషన్ వేశారు. దీంతో వార్డు ఏకగ్రీవమైంది. అయితే వ్యక్తిగత కారణాలతో ఆమె కూడా సోమవారం తన నామినేషన్‌ను ఉప సంహరించుకున్నారు. దీంతో వార్డు ఎన్నిక వాయిదా పడింది. వార్డుకు మళ్లీ నోటిఫికేషన్ విడుదలవుతుందని ఎంపీడీఓ చెప్పారు. కాగా యర్రగుంట్ల 8 వార్డు, వనికినిదిన్నె 5 వార్డుకు ఎన్నికలు జరగనున్నాయి. యర్రగుంట్ల వార్డుకు గుత్తి బాలరంగయ్య, వల్లంపాటి వెంకట సుబ్బయ్య మధ్య పోటీ నెలకొంది. అలాగే వనికినిదిన్నె వార్డుకు జిలకర కుమారి, జిలకర సుశీలమ్మ పోటీలో ఉన్నారు.

ముగిసిన ఉప సంహరణలు

రుద్రవరం: మండలంలో పంచాయతీ ఉప ఎన్నికలకు సంబంధించి నామినేష్ల ఉప సంహరణల గడువు ముగిసింది. పేరూరు పంచాయతీలోని 5వ వార్డు స్థానానికి పోటీ తప్పనిసరి అయ్యింది. మండలంలో పేరూరులో 5వ వార్డు, ఆర్.నాగలవరంలో 7వ వార్డు, నర్సాపురంలో 10వ వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మూడు వార్డు స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణలు ముగిసే సరికి నర్సాపురం,ఆర్.నాగులవరం వార్డు స్థానాల్లో ఒక్కొక్క నామినేషన్ నిలవడంతో ఏకగ్రీవం అయ్యాయని, పేరూరులో మాత్రం ఇద్దరు మిగలడంతో అక్కడ పోటీ ఉందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు.


రాంపల్లె 3వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దస్తగిరమ్మకు ధ్రువ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి జకరయ్య

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం, నర్సిపల్లె గ్రామ పంచాయతీల్లో 5,7 వార్డు మెంబర్లకు నామినేషన్ల ఉపసంహరణ సోమవారం ముగిసింది. నర్సిపల్లె గ్రామానికి చెందిన ముల్లా గౌసీబీ 5వ వార్డుకు , హరివరం 7వ వార్డుకు తొగట చౌడమ్మ ఒకే అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు రిటరి ్నంగ్ అధికారులు రామకృష్ణారెడ్డి, ఫణీత్‌కృష్ణ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు ధ్రువ పత్రాలను అందజేశారు.

చాగలమర్రి: మండలంలోని రాంపల్లె, బ్రాహ్మణ పల్లె గ్రామాల్లో ఖాళీగానున్న రెండు వార్డులకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రాంపల్లెలో నలుగురు, బ్రాహ్మణపల్లెలో ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే సోమవారం రాంపల్లెలో ముగ్గురు ఉపసంహరించుకోవటంతో దస్తగిరమ్మను 3వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి, రిటర్నింగ్ అధికారి జకరయ్య ధ్రువ పత్రం అందజేశారు. అలాగే బ్రాహ్మణపల్లెలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహారించుకున్నారు. మిగిలిన స్వర్ణలత, ఓబులేసుల మధ్య పోటీ నెలకొంది.

దొర్నిపాడు: అర్జునాపురం గ్రామలోని 1వార్డు ఉప ఎన్నికల్లో భాగంగా నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ఇద్దరు పోటీలో ఉన్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. వీరిలో ఒకరు తిరస్కరణకు గురికాగా, మరొకరు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో శ్రీనివాసులు, హుసేన్‌బాషా పోటీలో నిలిచారు.

ఎస్సీ,ఎస్టీ కేసుపై విచారణ

చాగలమర్రి: ఈనెల1న స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదైన మద్దూరు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ కేసుపై ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య సోమవారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మద్దూరు గ్రామంలో 4 ఎకరాల భూమిని దండు లక్ష్మీదేవి అదే గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ షరీఫ్ అనే వ్యక్తికి విక్రయించింది. తాను అంతకు ముందు షరీఫ్‌కు విక్రయించలేదని, కేవలం ఆయకం పెట్టినట్లుగా నకిలీ బాండ్‌ను సృష్టించి, అదే భూమిని తన కుమారుడు హరినాథ్‌కు రిజిస్ట్రేషన్ చేసిచ్చింది. దీంతో షరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నాడు రెండు కేసులు నమోదు చేశారు. అనంతరం షరీఫ్ ఆ పొలంలో పంట సాగు చేయగా.. లక్ష్మీదేవి, మరికొందరితో వెళ్లి పంటను దున్నేసి, షరీఫ్ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో వారు మళ్లీ పోలీసులను ఆశ్రయించగా దాడి కేసు నమోదు చేశారు. అలాగే.. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు తనను విచారణ అధికారిగా నియమించారని డీఎస్పీ చెప్పారు. కేసును కుణ్ణంగా విచారించి నివేదికను ఎస్పీకి పంపుతామని తెలిపారు. ఎస్‌ఐ రమణయ్య, కానిస్టేబుల్ రమణ ఉన్నారు.


మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

ఘనంగా తిరంగా ర్యాలీ

నంద్యాల(సిటీ): ముందస్తు స్వాతంత్ర్య వేడుకలతో నంద్యాల పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. సోమవారం వంద అడుగుల భారీ జాతీయ జెండాతో పట్టణ పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు, విద్యార్థులు చేసిన వందేమాతర నినాదాలు దద్దరిల్లాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు ర్యాలీని చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల బలిదానాలతో మనం నేడు స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామన్నారు. మహాత్ముడి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంఈఓ బ్రహ్మం నాయక్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ మధుకుమార్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

బొమ్మలసత్రం: మానసిక స్థితి సరిగాలేని సుధాకర్ (22) నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై సోమవారం వేకువజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండల కేంద్రానికి చెందిన సుధాకర్ పాలిటెక్నిక్ పూర్తిచేసి స్థానిక ఎస్పీవై రెడ్డి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లి బైక్, మొబైల్ ఫోన్‌ను ఉంచి బస్సులో నంద్యాల పట్టణానికి చేరుకున్నాడు. వేకువజామున ఎన్‌జీవోస్ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యాయం చేయాలని ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామంలోని ఎస్సీ కాలనికి చెందిన మొండి మద్దిలేటి అనే వ్యక్తి తమకు న్యాయం జరగలేదని సోమవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ ఎస్సీ కాలనీలో దాదాపు 3 సెంట్ల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని అదే కాలనికి చెందిన గోవిందు గుర్రన్న, గోవిందు శివరాముడు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపేందుకు కోర్టు నుంచి స్టే తెచ్చామని, స్టే కాపీని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ రమణయ్యకు అందజేసినా తమకు సహకరించి న్యాయం చేయకపోగా, అక్రమ నిర్మాణం చేపట్టిన వారికే మద్దతు పలుకుతున్నాడని మొండి మద్దిలేటి పోలీసుస్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు తాగాడు. మెరుగైన చికిత్స కోసం వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణానికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

స్థానిక ముత్యాలపాడు బస్టాండు సమీపంలోని చింతలచెరువు రస్తాలో నివాసం ఉంటున్న రైతు, వ్యాపారి మహబూబ్ షరీఫ్ (40) అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షరీఫ్ వ్యవసాయంతో పాటు, జొన్నలు, శనగలు తదితర ధాన్యాల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల వరుసగా నష్టం వాటిల్లడంతో అప్పులు అధికమయ్యాయి. దీంతో దిక్కు తోచని స్థితిలో విషపు గుళికలు మింగాడు. చాగలమర్రి పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

నంద్యాల(సెంట్రల్): వర్షాభావ పరిస్థితులతో సాగు నీటి విడుదలలో జాప్యం జరుగుతున్నందున జిల్లా రైతన్నలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా జూలై రెండవ వారంలో కేసీకి నీరు విడుదలై ఆగస్టు మొదటి వారానికి వరి నాట్లు పూర్తయ్యేవని, కానీ ప్రస్తుతం పరిస్థితి ఆశాజనకంగా లేదన్నారు. ఆయకట్టుకు ఆగస్టు చివరి వరకు ఎప్పుడు నీటిని విడుదల చేసినా..స్వల్పకాలిక వరి రకాలను దమ్ము చేసి వెదజల్లే పద్ధతిలో లేదా ప్యాడీ సీడర్ సాయంతో వేసుకోవాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి నాట్లు వేస్తే చీడపీడల ఉధృతితో పెట్టుబడి వ్యయం పెరిగి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి సాగు చేసే రైతన్నలు జొన్నలు (ఎన్ టీజే1,2,5, ఎన్13 రకం), మొక్కజొన్నలు (డీఎంహెచ్ యూ117, ప్రయివేటు సంకర రకం), మినుము (టీబీ4104, జీబీజీ1, పీయూ31), కొర్ర(మహానంది, సూర్యనంది, రేనాడు) రకాలను సాగు చేయాలని సూచించారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి సాగు చేసేవారు పొద్దుతిరుగుడు (1యు12, ప్రయివేటు సంకర రకాలు), నువ్వులు (వైఎల్ఎం66, వైఎల్ఎం17, శ్వేత చందన), సోయా (జేఎస్335), శనగ (జేజీ11, ఎన్‌బీఈజీ119, కేఏకే2), కొర్ర (మహానంది, సూర్యనంది, రేనాడు), మొక్కజొన్నలు (డీఎంహెచ్ యూ117, ప్రయివేటు సంకర రకాలు) సాగుకు అనుకూలమని పేర్కొన్నారు.

ప్రజారోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు


మలేరియా, డెంగీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నంద్యాల టౌన్: నిల్వ నీటి వల్ల ఏర్పడే ప్రమాదాల గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించేలా చర్యలు చేపట్టాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ మలేరియా ఆఫీసర్ సరస్వతి దేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని హరిజనవాడ – 2 ప్రాంతంలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో భూ సర్వే పూర్తి

ఉయ్యాలవాడ : వైఎస్సార్ జగనన్న భూరక్ష రీ సర్వే మండలంలో రెండవ విడత చేపట్టిన కార్యక్రమం మూడు గ్రామాల్లో సోమవారం తుదిదశకు చేరుకుందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడత కొండుపల్లె గ్రామంలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తి చేశామన్నారు. అలాగే ఈ గ్రామంలో 150 మంది రైతులకు భూములకు సంబంధించిన భూరక్ష పత్రాలను పంపిణీ చేశామన్నారు. రెండవ విడతలో రెవెన్యూ భూ రికార్డుల ఆధారంగా నర్సిపల్లె, సుద్దమల్ల, గోవిందపల్లె గ్రామాల్లో రైతుల సమక్షంలోనే రీ సర్వే పకడ్బందీగా చేపట్టమని చెప్పారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా మ్యాపింగ్ చేశామన్నారు. నర్సిపల్లె గ్రామంలో 416 మంది రైతులకు సంబంధించిన 1,221.35 ఎకరాలను సర్వే చేశామని, ఇందులో ప్రభుత్వ భూమి 160.01 ఎకరాలు ఉందని చెప్పారు. సుద్దమల్లలో 322 మందికి రైతులకు చెందిన 1,226.26 ఎకరాలకుగాను ప్రభుత్వ భూమి 192.19 ఎకరాలు, గోవిందపల్లె గ్రామంలో 132 మంది రైతులకు సంబంధించిన 606.52 ఎకరాల్లో ప్రభుత్వ భూమి 140.01 ఎకరాలను గుర్తించామని వివరించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ నంద్యాల డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రఫీ కోరారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులోని కోట్లాది రూపాయలను వేరే రంగాలకు తరలించడం బాధాకరమన్నారు. బీఓసీ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయాలని కోరారు. 65సంవత్సరాలు నిండిన కార్మికుడికి రూ.5వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. మున్నా, మౌలీసా, ఇంతియాజ్, రహిమాన్, ఇర్ఫాన్, మహబూబ్‌బాషా, మాబువలి, రఫీ, పఠాన్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

పిల్లల్లో ధార్మిక చింతనను పెంపొందించాలి

చాగలమర్రి: గ్రామాల్లో పిల్లలకు ధార్మిక చింతన, సంస్కృతి, క్రమశిక్షణ పెంపొందించాలని అభినవ శంకరానంద స్వామి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులకు పిలుపునిచ్చారు. స్థానిక శివరామనంద ఆశ్రమంలో సోమవారం జిల్లా సహ కన్వీనర్ సల్లా నాగరాజు, మండల కన్వీనర్ వి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు గ్రామ కమిటీలు, సామూహిక హారతి కార్యక్రమాల గురించి వివరించారు. రాయలసీమ జోన్ ధర్మ ప్రచారక్ ఈశ్వరరెడ్డి, జిల్లా సహ కన్వీనర్ నాగమోహన్‌రెడ్డి, మండల హిందూ ఐక్య సంఘం అధ్యక్షుడు చింతకుంట రమేష్, సభ్యులు గుత్తి నరసింహులు పాల్గొన్నారు.

బాలికలకు నగదు ప్రోత్సాహకం

రుద్రవరం: విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థినులను మరింత ప్రోత్సహిస్తామని కెనరా బ్యాంక్ మేనేజర్ బత్తుల లింగమయ్య తెలిపారు. సోమవారం స్థానిక బ్యాంక్‌లో ఆయన మాట్లాడుతూ..కెనరా విద్యా జ్యోతి స్కీం కింద ఆగస్టు 15న స్థానిక జెడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో ఎస్సీ,ఎస్టీ బాలికలు ఆరుగురికి నగదు ప్రోత్సాహం అందజేస్తామని తెలిపారు. 5,6,7 తరగతుల నుంచి ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ముగ్గురికి, 8,9,10 తరగతులకు చెందిన వారిలో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పు ముగ్గురికి డీడీల రూపంలో అందజేస్తామని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన యువకులకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్ష విధించినట్లు కోర్టు పోలీసులు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీసు ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా రమేష్, బ్రహ్మానాయుడు, సాల్మన్‌రాజు, రవికుమార్‌పై కేసు నమోదు చేసి జడ్జి ముందు హాజరు పరచగా వారికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.